# అందవిహీన



శర్వాణి

యమున నిర్ధారం విన్న లక్ష్మీపతి బెంబేలుపడిపోయారు. కూతురికి ఏవిధంగా, ఏమని నచ్చచెప్పాలో తోచలేదాయనకు అమె ఒక నిశ్చయానికి వచ్చిందంటే అది సకారణంగానే వుంటుందనీ, ఇక దానికి తిరుగుండదనీ ఆయనకు బాగా తెలుసు కానీ ఇప్పుడాయనను బాధిస్తున్నదల్లా ఈ వృద్ధాప్యంలో వున్న ఒక్కగానొక్క కూతురినీ దూరంగా పంపేసి తను ఒంటరిగా ఉండగలడా అన్నదే కూతుర్ని దగ్గర కూర్చోబెట్టుకొని 'అమ్మాయి! ఈ ముసలివాణ్ణిలా బాధపెట్టడం న్యాయమేనామ్మా!' అన్నారు. ఆయనకళ్ళు చెమర్చాయి. గొంతు బొంగురుపోయింది.

యమున తండ్రిమెడను వాటేసుకుని "నాన్నా! నీ కిష్టంలేందే నేనెక్కడికీ వెళ్ళను నాన్నా!" అంది.

లక్ష్మీపతిగారు కాస్త తేరుకుని సర్దుకు కూర్చున్నారు.

"కానీ, నాన్నా! ఒక్క షరతు!" అంది యమున.

"ఏమిటమ్మా! ఆ షరతేమిటి?"

"మరి నువ్వు నా పెళ్ళిమాటలు తలపెట్టనని మాటివ్వు."

"అదేమిటమ్మా. అదెలా కుదురుతుంది? నీకిష్టమయినవాడినే నువ్వు కోరుకున్నవాడినే చేసుకో. కాని పెళ్ళే వద్దంటే ఎలాగమ్మా?"

"అది కాదు నాన్నా! నాకు నచ్చినవాడి

నెన్నుకోవాలఉం నేనీ పరిసరాలనుండి బయటపడాలి. నేనిక్కడుంటే మన ఐశ్వర్యాన్ని తప్ప, నా వ్యక్తిత్వాన్ని ఎవరూ గుర్తించరు ఈ సంపదను అందుకోవటానికి నేనో సాధనాన్ని మాత్రమే అవుతాను కాదంటావా? నాన్నా!

ఎప్పుడూ మనస్సులో ఊహించనైనా ఊహించని మాట విని, లక్ష్మీపతిగారు దిగ్భ్రమ చెందాటు.

"నేను రూపసిని కాను. స్వతహా ఆకర్షించే అందంగానీ, రంగుగానీ నాకు లేదు. మిగతావి ఎవరిక్కావాలి? నాన్నా! మనచుట్టూ చేరేవాళ్ళంతా సంపదకోసం కాకపోతే నాకోసమనిపించటం లేదు నాన్నా!"

యమున మాటల్ని జీర్ణించుకోలేక పోయారు లక్ష్మీపతిగారు.

"అయితే ఇప్పుడు నిన్ను చేసుకుంటానంటున్నవాళ్ళంతా ఈ డబ్బుకోసే నంటావ్?"

"నే ననటంకాదు నాన్నా! మీరుకూడా ఆలోచించండి. మోహన్ సంగతే తీసుకోండి. ఎప్పుడూ నాచుట్టూ తిరుగుతూ ఒకటే ఆకాశాని కెత్తేయ్యటం – నేను ఊర్వశినట, రంభనట; మిగతావాళ్లంతా నా కాలిగోటికి సరిపోలరట నా కళ్ళు నక్షత్రాల్లా మెరుస్తాయట ... ఒకటి కాదు. నేను 'ఊ' అంటే నా కాళ్ళదగ్గిరే పడివుంటాడట."

"..........."

"నా కాళ్ళదగ్గర పడివుండేవాడు నా కక్కర్లేదు నాన్నా! నాకు కావలసింది పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించి ప్రేమించే భర్త. ఏమంటావు నాన్నా!"

"నిజమే నమ్మా. ... కమన శేఖరం..."

"అదే ఆయన సంగతే చెప్పబోతున్నాను. మన బ్యాంకు అకౌంటులో ఎంతుందన్నాడు. ఇంకా స్థిరాస్తి ఎక్కడ వుందో, ఎంతెంతుందో వివరాలు చెప్పమన్నాడు. నా కేం తెలియదన్నాను మరీ వత్తిడి చెస్తే 'నాన్నగారి సంగతి మీకింకా తెలియనట్టుందే? ఆస్తి ఎంతుందో తెలియదుగాని అంతకు రెండు రెట్లు అప్పుం' దన్నాను. అంతే. తరువాత నా మొహం చూస్తే ఒట్టు"

లక్ష్మీపతిగారు ఫకాలుమని నవ్వారు.

భేష్ భేష్, భలే టోపీ వేశావే. కానీ శేఖరం అటువంటి వాడని నే ననుకోలేదు సుమా."

యమునకూడా నవ్వుతూ –

"ఇంకా విను. మరి. మూర్తిగారి సంగతి. నాకన్నా యోగ్యుడు నీ కెక్కడ దొరుకుతాడు? నన్ను పెళ్ళాడెయ్యి' అన్నాడు. 'మరి, మీ రింకా ఉద్యోగం సద్యోగం చూసుకోకుండా ఇలా వుండిపోయారేమి' టన్నాను. 'అదే చూస్తున్నా బిజినెస్ చెయ్యాలనుంది' అన్నాడు. 'సరే, ఏం బిజినెస్

చేస్తారు? ఎంత పెట్టుబడి పెడతారు?' అనడిగాను వెంటనే ఆశ్చర్యపోతూ 'పెట్టుబడికి కొదవేమిటి? నువ్వుండగా నాకేం తక్కువ? నీ డబ్బు నా డబ్బు కాదా?' అన్నాడు. అతని అతిచనువుకు నాకు వళ్ళుమండింది.

"'మరయితే మీ కింకా తెలియదన్న మాట' అన్నా.

"'ఏమిటేమిటి' అన్నాడు కంగారు పడిపోతూ.

"'అదే, నా పెళ్ళిలోనే నాన్న ఆస్తి అంతా ఏడుకొండలవాడికి సమర్పించాలని మొక్కు వుందట. చిన్నప్పుడు నే జబ్బుపడితే మొక్కుకున్నారట. అందుకే నా పెళ్ళి వాయిదా వేస్తున్నారు' అన్నా. అంతే ఈ చుట్టుపక్కల అతని జాడ లేదు. మచ్చుకు మాటు చెప్పాను; ఇంకా చెప్పమంటారా?"

లక్ష్మీపతిగారు నవ్వలేక ఆయాసపడ్తూ, "చాలు తల్లీ ఇహ చాలు. ఇప్పుడు నీ ప్లానేమిటో చెప్పు. కొస్త మార్పు చెయ్యటానికి వీలుంటే చూద్దాం," అన్నారు.

"అదే, చెప్పానుగా. ఉద్యోగానికి అప్లై చేశాను—కొద్దిరోజులపాటు ఎక్కడైనా దూరంగా వుండిపోదామని. అక్కడ నాకోరిక ఫలించవచ్చునని నా ఆశ. నన్ను, నన్నుగానే చూసి ఇష్టపడేవాడిని చేసుకుందామని."

"ఎంత ముప్పొచ్చిందమ్మా ఈ ఐశ్వర్యంవల్ల! ఎంతోమంది తండ్రులు డబ్బులేక పిల్లలకు పెళ్ళిళ్ళు చెయ్యలేక పోతున్నారు. నాకేమో ఆ డబ్బే అడ్డొచ్చింది."

"అదిగో, నువ్విలా నొచ్చుకుంటే— నే నసలు వెళ్ళనేవెళ్ళను ఇలాగే వుండిపోదాం నువ్వే పెళ్ళిచేసుకోమని తొందర పెడుతున్నావు."

"నిజమే నమ్మా తొందరపడుతున్న మాట నిజమే. నే నేక్షణంలో కళ్ళు మూస్తానో తెలియదాయె. ఆసరాలేకుండా ఎలా బతుకుతావమ్మా. నీ ఇష్టప్రకారమే కానీ. ఎలాగైనా నువ్వు సుఖంగా వుండటమే నాక్కావాల్సింది. కాని ఎక్కువ రోజులు నిన్ను విడిచివుండలేను తల్లీ. కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకుని నీకోసం ఎదురు చూస్తూంటాను."

తండ్రి అనుమతి యమునకు వెయ్యి ఏనుగుల బలాన్నిచ్చింది.

"అయితే చూడు. బెంగుళూరులో ఇంటర్వ్యూకు వచ్చింది. వెళ్ళమంటావా? బహుశః ఉద్యోగం దొరుకుతుంది."

లక్ష్మీపతిగారు స్థిరంగా కూతురివేపు చూస్తూ —

"అయితే అంతా నిశ్చయించుకున్నట్టే నన్నమాట, నాకు చెప్పటం; కాని నాకు తప్పకుండా వుత్తరాలు రాస్తూండటం మాత్రం మర్చిపోకు. నీనుండి ఉత్తరం రాకపోతేమటుకు నేనే వెంటనే బయల్దేరి వస్తాను."

అంతపని చెయ్యకు నాన్నా! తప్ప కుండా రాస్తాను. నువ్వుమాత్రం వంట్లో బాగాలేకపోతే తప్ప ఉత్తరాలు రాయకు. సాధ్యమైనంత త్వరలో వచ్చేస్తాను. సంవత్సరంలోపల నాఆశయం నెరవేరక పోతే తర్వాత నువ్వు ఎలా చెబితే అలా చేస్తాను. అంతకుముందే నా అన్వేషణ ఫలిస్తే వెంటనే తిరిగి వచ్చేస్తాను;" యమున దృఢంగా అంది

యమున వెళ్ళేరోజున లక్ష్మీపతిగారికి మనస్సులో మనసులేదు చిన్నప్పటి నుండీ తల్లీ, తండ్రీ తనేఅయి పెంచి పెద్దచేసిన తండ్రిని ఈ వృద్ధాప్యంలో ఈవిధంగా వదిలి వెళ్ళాల్సివచ్చినందుకు యమునకూ బాధగానేవుంది. కానీ మరో మార్గం లేకపోయింది.

రైల్లో కూర్చుని, బయట నుంచున్న తండ్రితో "నువ్వు మరేం బెంగపెట్టు కోకు నాన్నా! వీలయినంత తొందరగా వచ్చేస్తాగా," అంది గద్గద కంఠంతో యమున. లక్ష్మీపతిగారు చిరునవ్వుతో "అలాగేనమ్మా.నిన్నుఆశీర్వదిస్తున్నాను. నీకోరిక ఫలిస్తుంది;" అన్నారు విందుగా. కదిలిపోతున్న రైలువంకే చూస్తున్న ఆయన మనస్సులో రకరకాల ఆలోచ నలు అలుముకుని మనస్థిమితం లేకుండా చేస్తున్నాయి. సంపదనుండి విడదీసి వేరుగా నిలబెట్టి చూసినప్పుడు ఆయన కళ్ళకు యమున మరింత ఆకర్షణీయంగా కనపడింది. ఆమె మొహంలో ప్రతి ఫలిస్తున్న సౌమ్యతా, సౌశీల్యం, మృదు త్వం, స్నేహశీలతా ఆమెకో విశిష్ట వ్యక్తిత్వాన్ని ప్రసాదించాయి. కూతురి కోరిక అసంబద్ధంగా ఆయన కనిపించ లేదు. అందులో ఆమె కృతకృత్యు రాలు కాలేకపోతుందేమో నన్న బెంగ లేదు కానీ అది ఎప్పటికి? తన కళ్ళ ముందే ఆమె జీవితం స్థిరపడేలా చూడాల్సిన బాధ్యత తనకు లేదా! ఇదే ప్రస్తుతం ఆయన్ను బాధిస్తున్న సమస్య. లోకంపోకడ తెలిసిన అనుభవం గల ఆ తండ్రికి, ఇంతటి సంపదకు వారసు రాలైన యమునను తాను వంటరిగా వదలేసి కళ్ళు మూస్తానేమో నన్న బెంగ మరింత ఆలోచనాపరుణ్ణి చేసింది.

* * *

ఆ రాత్రి పరుపుమీద పడుకున్న యమునకు తండ్రిరూపం పదేపదే కళ్ళ ముందు మెదలసాగింది. తన జీవితంలో తనను జమీందారిణిగా కాక యమునగా, ఒట్టి యమునగా అభిమానించే వ్యక్తి లభించాడు.

ఎప్పుడూ తెల్లటి దుస్తుల్లో ఠీవిగా వుండే కేశవమూర్తి...అతను జ్ఞాపకం రావటంతోనే ఆమె మనస్సు ఆనందంతో నిండిపోయింది.

బెంగుళూరు వచ్చిన క్రొత్తలో ప్రతి శనివారం సాయంకాలం లాల్ బాగ్‌లో ఓ విర్జనమయిన మూలలో కూర్చొని ఆ చెట్లనీ, ఆకాశాన్నీ,



నిశ్శబ్దంగా చూస్తూ గడపటం అలవాటయ్యింది. అక్కడే రెండు మూడు వారాలు ఒకచోటనే, తనుకూర్చునేచోటికి కొంచం అవతలగా, సన్నగా, పొడుగ్గా, ఠీవిగా ఉన్న ఆ యువకుడిని చూడగానే ఆశ్చర్యపోయిందామె. ఏకాంతంగా, నిశ్శబ్దంగా తన్ను దాచుకోగలదనిపించే ఈ చెట్లనీడన హాయిగా కూర్చుందామని వస్తే ఇదేంపీడరా బాబూ అనుకుంది కానీ కొన్నిరోజులకు తనచుట్టూ ఉన్న చెట్లూ, కొలనూ, పచ్చికా ఎంత పరిచితమైనవో అతనూ అంతే అన్నట్టయిపోయింది ఆమెకు. ప్రతివారమూ అక్కడికి రాగానే అతనక్కడ ఉన్నాడో లేదోనని వెతికేవామెకళ్ళు. అతను కనబడితే అంతా సరిగ్గా వున్నట్టే, సంతృప్తిగా తన ఆలోచనల్లోకో, లేక తెచ్చుకున్న పుస్తకంలోకో మునిగిపోయేది. అతను కనబడకపోతే ఏదో వెలితిగా ఫీలయ్యేది ఆమె మనస్సు. అతనా వారం రాకపోతే ఇక కాసేపు మొక్కుబడిగా గడిపి వచ్చేసేదామె. ఆమె ఉనికినే గమనించనట్టు

ఏదయినా పుస్తకం చేతబట్టి కూర్చునే అతనికి సభ్యతకు ఆమె మనస్సు మెచ్చుకుంది.

ఎప్పుడూ ప్రతిశనివారం సాయంత్రం మాత్రం లాన్‌లాగ్‌లో కనిపించే ఆ యువకుడు కొన్ని రోజులకు ఆమె నివసించే ప్రాంతాల్లో, బస్‌స్టాపుల్లో కనిపించేవాడు. ఆమెను చూడగానే పలకరింపుగా చూసేవాడు. వెంటనే యమున మరోవేపుకు దృష్టిని మరల్చేది. కాని నిశితమైన రెండు కళ్ళు తనను పరిశీలనగా చూస్తున్నాయని ఆమెకు తెలిసేది. అపరిచితుడయిన ఆ యువకుడి కుతూహలానికి ఆశ్చర్యపోయినా, వెకిలిగా ప్రవర్తించని అతన్ని మనసులో గౌరవించేది.

ఓరోజు దార్లో అనుకోకుండా అతడు, ఆ ఊళ్ళో పరిచయమున్న సుధతో కనిపించాడు. అతన్ని చూడగానే ఉలిక్కిపడిందామె. సుధపక్కన అతన్ని చూడంగానే స్తంభించి పోయింది. సుధ యమునను పలకరించి 'ఇతడు నా కజిన్ కేశవమూర్తి; ఈమె యమునాదేవి; ఇక్కడే ఓ ఫార్మసీలో టైపిస్ట్‌గా పనిచేస్తున్నా'రని పరిచయం చేసింది. యమునకు అంతా కలలో జరిగినట్టుంది. అతని నమస్కారానికి యాంత్రికంగా ప్రతినమస్కారం చేసి కలలోలాగే ఇంటికి వచ్చిపడింది.

ఎందుకు? సుధ పక్కన అతన్ని చూసినప్పుడు తనెందుకంత కలవరపడింది? అతడు తనకు సుధ పరిచయం చేసేదాకా పరిచయస్తుడు కాడు. ఎంత లెక్కపెట్టినా నాలుగయిదు మాటలన్నా ఎక్కువ మాట్లాడలేదు. అతడితో తనకున్నదల్లా ముఖపరిచయం మాత్రమే. అతడిగురించి ఎప్పుడూ పెద్దగా ఆలోచనయినా ఆలోచించలేదు. అయినా... అయినా... అతడు సుధతో కలిసి కనిపించినంతమాత్రాన తనెందుకంత కలవరపడాలి?

తనగదిలో మోహం దాచుకుని జీవితంలో అంతవరకెన్నడూ ఏడవనట్టుగా ఏడ్చింది యమున; ఆమె తను అతనికి ఏమీ కాదని తెలిసి, ఆ శూన్యతను భరించలేక పోయింది. తనకు లేని అందాన్నీ, తన అతి సామాన్యరూపాన్నీ తల్చుకుని బాధపడింది.

యమున మనస్సులో జరగబోయేదంతా సినిమారీలులా తిరుగసాగింది. అతడు అలవాటుగా ఆ మూలకు వచ్చి దూరంనుండి ఆ చెట్టునీడలో తనను చూసి ఉలిక్కిపడి మరోచోట, అక్కడికి దూరంగా, తన గాలికూడా సోకనంత దూరానికి వెళ్ళి కూర్చుంటాడు. ఇక ఆమెను పలకరించే భయం లేదు కదాని ధైర్యంగా నవ్వుకుంటాడు. కాని తను దాన్ని భరించలేదు. తను అందవిహీన అనవచ్చును. కాని తనను చూస్తే భయపడి పారిపోయేంత భయం




కరంగా లేదు. ఏమయినా అతడు తన్ను చూసినవెంటనే మొహం తిప్పుకుపోవ టమమాత్రం తథ్యం. ఆ ఊహ నిజంగా జరిగిందేమోనన్నంత ఉన్నతంగా ఏడ్చి, ఏడ్చి నిద్రపోయిందామె.

ఆ శనివారం, ఆ తర్వాతి శనివారం ఆమె లాల్‌బాగ్‌కు వెళ్ళలేదు తన భయం నిజమవుతుందేమో నన్న భయంతో. అతను ఎక్కడ కనిపిస్తాడో అనిపించితే, ఆ వైపు కన్నెత్తికీ వెళ్ళకుండా తప్పించుకు తిరిగింది.

ఇలా అతన్ని పరిచయం చేసిన మూడువారాలకు కాబోలు యమున తన బాధన్నీ, అనుమానాల్నీ గుండెలలో దాచుకుని చిరునవ్వు నవ్వడం నేర్చుకున్న యమునగా మారాక, ఏదో షాపింగ్‌కు బజారుకు వెళ్ళి, అక్కడ అతన్ని చూసి కంగారుపడింది. అంతకన్నా ఆమె నాశ్చర్యపర్చిన విషయం మరొకటుంది.

అంతవరకు ఆ యమున జీవితంలో తండ్రితప్ప మరెవ్వరూ అంత ఆప్యాయంగా, సంతోషంగా నవ్వుతూ ఆమెను పలకరించలేదు. అతడు ఆమె అనుకున్నదానికి వ్యతిరేకంగా నవ్వుతూ పలకరించాడు. ఆ జ్ఞానం రాగ్గానే ఆమె మనస్సు గంతులువేసింది, ఆ పట్టరాని సంతోషంతో. అయినా గంభీరంగానే జవాబిచ్చింది. అతను –

"ఈ మూడు వారాలు మీరేవిటి ఇల్లు విడిచినట్టు లేరే? కనీసం లాల్‌బాగ్‌కైనా రాలేదేం?" అని అడగ్గానే

మరింత ఆశ్చర్యపోయింది. తనుకూడా ఓ వ్యక్తిగా గుర్తించా డతడు! తన కోసం మూడువారాలు ఎదురుచూశాడు! తను రాలేదని బాధపడ్డాడు! ఆ ఊహ ఆమె కెంతో సంతృప్తి నిచ్చింది.

"ఏమిటో ... రాలేకపోయాను..." అనిమాత్రం జవాబిచ్చి వూరుకుంది.

"పోనీ కనీసం ఈ వారమయినా వస్తారా."

"చూద్దాం...ప్రయత్నిస్తాను."

"భలేవారే! మొత్తానికి ఆడవాళ్ళని అనిపించుకున్నారు," నవ్వుతూ అన్నా డతడు.

"వస్తాను" అని ధైర్యంగా అతని కళ్ళవేపు చూసింది. నిర్మలంగా నవ్వు తున్నాయవి.

ఆ శనివారం నాలుగయ్యేవరకు వెళ్ళనా వద్దా అని కొట్టుకులాడిం దామె మనస్సు. వెడితే పిలవగానే వచ్చేసే అమ్మా యనుకుంటాడేమో. తను అత నికి లోకువయిపోదూ? కాని ఆమెకు అతన్ని చూడాలని, అతన్తో మాట్లాడాలని ఉన్నకోరిక ఈ అభ్యంతరాన్ని తోసి పారేసి ఆమెను బయల్దేరదీసింది. వస్తా నని చెప్పి వెళ్ళకపోతే ఏమనుకుంటాడో నని తనకు తానే నచ్చచెప్పుకుని బయ ల్దేరింది.

అతడు ఆమె వెళ్ళేసరికి మామూలు ప్రదేశంలో పచార్లు చేస్తున్నాడు. వెళ్ళ గానే నవ్వుతూ ఎదురువచ్చి "ఇంత ఆలస్యం చేశారేం నేను వచ్చి అప్పుడే అరగంటయ్యింది తెలుసా?" అన్నాడు.

"వస్తానని చెప్పానేగాని, time fix చెయ్యలేదుగా," అంది యమున నవ్వ టానికి ప్రయత్నిస్తూ

"ఫరవాలేదు. మీకూ మాటలువచ్చే" అన్నా డతడు ఆశ్చర్యంగాకళ్ళుపెద్దవిచేసి.

యమునకు ఇంతవరకు పరిచయ మున్న వ్యక్తుల పోలికలు లేశమాత్రమైనా అతనిలో కనిపించలేదు. ఎంతో సరళంగా అరమరిక లేకుండా మాట్లా డేస్తున్నాడు.

అతడు తన ఆఫీసుసంగతులూ, తోటి ఉద్యోగులస్వభావాలనుగురించీ, కొత్తగా చూసిన సినిమాలోని మంచిచెడ్డల గురించీ, ఓ రచయిత నవలగురించీ ఏకబిగిన మాట్లాడుకుపోతూంటే రెప్ప వాల్చకుండా, పెదవి కదపకుండా చూస్తూ కూర్చుంది యమున.

అలా కేశవమూర్తి మాట్లాడడము వింటూంటే యమునకు కాలం ఏలాగడి చిందో తెలియలేదు. కాని మూర్తి మోహం కాసేపటికి చీకట్లో కనిపిం చటం మానేసింది. అప్పుడే లోకంలో కొచ్చి గొంతు పెగుల్చుకుని:

"టైమెంతైంది?" అంది.

"ఓ, బాగా చీకటి పడినట్టుందే" అంటూ వాచ్ కళ్ళదగ్గర పెట్టుకుని "అబ్బా ఎనిమిదిన్నరయింది. పదండి వెడదాం," అని లేచాడు. ఇంటికి చేరుకున్న

యమునకు ప్రపంచమంతా వెన్నెల విరిసినట్టే అనిపించింది. ఆ శనివారం తర్వాత అలాటివే శనివారా లెన్నోగడిచి పోయాయి. అతడామెకు రానురాను సన్నిహితుడు కాసాగాడు. ఓరోజు డబ్బున్నవాళ్ళగురించి మాట్లాడుతూ "డబ్బున్నవాళ్ళని భరించటం కష్టం యమునా!మీలా సౌమ్యంగా ప్రశాంతంగా ఉన్న అమ్మాయి లభిస్తే జీవితం హాయిగా గడుపెయ్యగలను," అన్నాడు

'మీలాగా' అనటంలో మీరే అయితే అన్నభావం ధ్వనించింది. రోజు రోజుకూ అతని మాటల్లో, చేతల్లో ఆమె ఊహించుకున్న ఆదర్శపురుషుడి పోలికలు కనిపించసాగాయి అతని మాటలప్రవాహంలో మౌనంలో పడి, మౌనంగా అతన్ని చూస్తూన్న క్షణాలు అనంతం కావాలని వాంఛించేదామె హృదయం. అతడు మాట్లాడుతూ ప్రకృతిని వర్ణిస్తూంటే, 'అతడు తనవాడయితే' అని కోరుకునే దామె.

ప్రతి శనివారంలాంటి ఓ శనివారం మాట్లాడుతూ హఠాత్తుగా "నన్ను పెళ్ళి చేసుకుంటారా యమునా?"అన్నాడుగంభీరంగా. అనుకోని ఈ ప్రశ్నకు ఉలిక్కిపడి అతనివేపు చూసింది. అతడు ఆదుర్దాగా ఆమెవేపు చూస్తున్నాడు.

"నిజంగా, సీరియస్‌గా అడుగుతున్నారా?" అన్నా యామెకష్ఫ

"నిజం యమునా! ఎన్నోమార్లు మిమ్మల్నీమాట అడుగుదా మనుకునే అడగలేకపోయాను. నా కెంతోమందితో పరిచయమయింది; కాని, ఇంత ఆత్మీయంగా నే నెప్పుడూ ఎవరిదగ్గరా ఫీలవలేదు మీదగ్గరయితే నా ఆలోచనల్ని హాయిగా చెప్పగలను; ఏమంటారు యమునా?" అతనికంఠంలోని ఆత్రుతని గుర్తించినా వెంటనే సమ్మతిని సూచించలేకపోయింది.

"రూపసిని కాని ఈ సామాన్యురాలిని, మీ రెందుకు కోరుకుంటున్నారు?"

"మీకోసమే యమునా, మీకోసమే. అందం, డబ్బూ ఉన్న స్త్రీలు తమని తప్ప మరెవర్నీ ప్రేమించలేరు. నాకు మీలా ఎదుటివాళ్ళని నిండుహృదయంతో ప్రేమించేవారు కావాలి మీ సౌమ్యతా, శాంతీ నన్నాకర్షించాయి. నాజీవితంలోని ఆనందమంతా మీ చేతుల్లో వుంది. అవుననండి యమునా."

అతని కంఠంలోని ప్రాధేయతను కాదనలేకపోయిందామె 'అలాగే' అంటూ సమ్మతిని సూచించినా, కన్నీటి నాపుకోలేకపోయింది.

"ఛ! ఛ! మన జీవితంలో సంతోషప్రదమైన ఈ రోజున ఇలా కంట తడి పెట్టొచ్చా! తప్పుగదూ? హాయిగా అలా తిరిగివద్దాం పదండి," అని బయటికి తీసుకువెళ్ళాడు. అతను తమ భవిష్యత్తు గురించి చెపుతుంటే ఆనందసాగరంలో తేలిపోయిందామె.

"మన కో చిన్న ఇల్లూ, ఇంటిముందు చిన్న తోటా; చక్కటి మొక్కలున్న పెద్ద తోటయితే ఇంకా బావుంటుంది; కాని ...మీరూ, నేనూ ఉద్యోగం చేస్తూ ......"

ఆమె వర్ణిస్తూంటే మళ్ళీ ఆమె మనస్సులో భయ, సందేహాలు తొంగి చూడసాగాయి. 'తనెవరో తెలిసినాక అతని ప్రేమ నిలుస్తుందా? దబ్బున్న ... హృదయహీనతనూ ... తో చూసే కేశవమూర్తి, ... సంగతి తెలిస్తే ఏమంటాడు? ... కపటంగా ప్రవర్తించిన పరిస్థితిని అర్థంచేసుకుని తనను క్షమించ గలడా? అలా జరగనప్పుడు ... జరగనప్పుడు ... తన కిక జీవితమే లేదు. అంతా శూన్యమే. ఇక ఆలస్యం చేసి లాభంలేదు, వెంటనే తండ్రిని సంప్రదించక తప్పదు' అనుకుంది.

* * *

తమ ఊరికి రమ్మని కేశవమూర్తి నాహ్వానించిన యమున బిక్కు బిక్కుమంటూ అతని రాకకోసం ఎదురుచూడసాగింది. అతను వస్తానని రాసిన రోజున ఆమె మనసంతా ఆందోళనతో నిండిపోయింది.

దూరంలో వస్తున్న కేశవమూర్తిని చూడగానే ఆమె మొహం ప్రఫుల్లమైంది. ఎదురు వెళ్ళి అతన్ని ఆహ్వానించింది.

ఆశ్చర్యంగా ఆ భవంతినీ, పెద్ద తోటనూ తిలకిస్తున్న మూర్తిని హాల్లో కూర్చున్న తండ్రికి పరిచయం చేసి, ఇహ అక్కడ నిలవకుండా లోపలికి పారిపోయింది యమున.

ఓ గంట గడిచాక తనను పిలుస్తూంటూ లోపలికి వచ్చిన కేశవమూర్తి వేపు చూసే సాహసం కలగక దామెకు మెల్లిగా బెదురుతూ కళ్ళెత్తి చూసింది మూర్తి ఆమెకు దగ్గరగావచ్చి భుజాలమీద చేతులు వేశాడు.

"అలా బెదురుతున్నావేం యమునా! మీ నాన్నగారు అంతా చెప్పారులే; ఇంత సంపదకు అధికారిణివైనా, దాని ఆధిపత్యం నీమీద లేదు. కనుకనే అలాటి కోరిక కోరుకోగలిగావు. కల్మషంలేని అమృతమూర్తివి నీవు," అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. యమున తేలికపడిన మనస్సుతో అతని కౌగిలిలో ఒదిగిపోయింది.

యమునా - మూర్తుల వివాహం, యమున ఇష్టప్రకారం, ఎక్కువ ఆడంబరం లేకుండానే జరిగిపోయింది.

కూతురు మొహంలోని సంతృప్తి లక్ష్మీపతిగారికి ఎనలేని శాంతి నిచ్చింది.

కాని తను యమునను మనస్ఫూర్తిగా ప్రేమించి పెళ్ళి చేసుకున్నా, తనకు మొదటే ఆమె ఎవరో తెలుసునన్న సంగతిని, మామగారి కిచ్చిన మాట ప్రకారం ఎప్పటికీ యమునకు తెలియనీయలేదు కేశవమూర్తి.